క్లుప్తంగా

వైఎస్సార్ బీమా అందజేత



బీమా సాయం అందజేస్తున్న వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్దిపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన వైఎస్సార్ బీమా తక్షణ సహాయం కింద మంగళవారం బాధిత కుటుంబానికి కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ అందజేశారు. మేరకు 51వ వార్డులో అంబేడ్కర్ కాలనీలో నివాసమున్నటువంటి పాలసీదారు పావడ రామలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో, ఆమె కుమార్తె వసంతకు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ తన కార్యాలయంలో బీమా తక్షణ సాయం రూ.10 వేలు అందజేశారు. మిగతా రూ.90 వేలు త్వరలోనే బ్యాంకు అకౌంటులో జమచేస్తారని తెలిపారు. కార్యక్రమంలో 287 సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ మహేశ్వరి, వలంటీరు కృప పాల్గొన్నారు.

నేడు ద్విచక్ర వాహనాల బహిరంగ వేలం

మద్దిపాలెం : విశాఖ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సర్కిల్–4లో పలు ద్విచక్ర వాహనాలకు బుధవారం బహిరంగ వేలం వేయనున్నట్టు సెబ్ సీఐ సీహెచ్‌వీఎస్ ప్రసాద్ తెలిపారు. ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడ్డ ఈ ద్విచక్ర వాహనాలకు ఉదయం 11.30 గంటలకు మురళీనగర్ లో ఎన్ఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో ఉన్న సెబ్ స్టేషన్‌లో వేలం ప్రారంభమవుతుందని అన్నారు. ఆసక్తి గలవారు ఈ వేలంలో పాల్గొనవచ్చని ఆయన తెలిపారు.

అల్లూరి స్టడీ సర్కిల్‌లో గ్రూప్‌-2 శిక్షణ

దాబాగార్డెన్స్: అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో అల్లూరి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్–2 అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నట్టు కేంద్రం కార్యదర్శి బి.గంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ముందుగా http://shorturl.at/mvyF3 లింక్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్‌కు ఈ నెల 16వ తేదీ ఆఖరని, ఈ నెల 20 నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. పూర్తి వివరాలకు 80084 12798 ఫోన్ నంబరులో గానీ, లేదా దాబాగార్డెన్స్, లలితానగర్(బాటా షోరూమ్ ఎదురుగా రోడ్డు)లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సంప్రదించవచ్చునని ఆయన పేర్కొన్నారు.

యువశక్తి పోస్టర్ ఆవిష్కరణ

సీతంపేట: జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఈ నెల 12న శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో యువశక్తి పేరుతో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ తెలిపారు. దీనికి సంబంధించి ప్రచార పోస్టర్లు ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభను విజయవంతం చెయ్యడానికి ప్రాంతాల వారీగా కమిటీలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువశక్తి కమిటీ సభ్యులు దూలం గోపి, నాగలక్ష్మి, గండి దుర్గాప్రసాద్, గురుప్రసాద్, మిడతాన రవికుమార్, దాసరి జ్యోతి రెడ్డి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

సీతమ్మధార (విశాఖ ఉత్తర): పోర్టు టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి డీఎల్‌వో జంక్షన్‌దరిలో ఫుట్‌పాత్‌పై గత నెల 20న ఫిట్స్ వచ్చి పడిపోయిన గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోర్ట్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు..ఫిట్స్ వచ్చి పడిపోయిన వ్యక్తిని స్థానికులు సపర్యలు చేసి 108లో కేజీహెచ్‌కు తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్టు వైద్యులు పేర్కొన్నారు. ఎస్ఐ ప్రమీల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు



దివ్యాంగుడితో మాట్లాడుతున్న కేకే రాజు



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తాటిచెట్లపాలెంలో స్థానికులతో మాట్లాడుతున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు

- ఇంటింటికీ సంక్షేమ పథకాలతో లబ్ధిదారుల ఆనందం
- గడపగడపకు మన ప్రభుత్వంలో కేకే రాజు

తాటిచెట్లపాలెం: గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు మంగళవారం జీవీఎంసీ 55వ వార్డు 250 సచివాలయం పరిధి తాటిచెట్లపాలెం, 80 ఫీట్ రోడ్డు ప్రాంతాలలో వార్డు కార్పొరేటర్ శశికళతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి నేరుగా లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు, స్థానికంగా వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు ఈ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి ప్రారంభించారన్నారు. జగన్‌మోహనరెడ్డి పరిపాలనలతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉన్నారన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా సీఎం పనిచేస్తున్నారన్నారు. వీధిలైట్లు వెలగడం లేదని స్థానికులు ఫిర్యాదు చేయగా కేకే రాజు వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సరిచేయించారు. కార్యక్రమంలో గంగామహేష్, దుప్పలపూడి శ్రీనువాస్, కాయిత పైడి రత్నాకర్, యడ్ల సిద్దార్థ, ఎర్రంశెట్టి శ్రీను, డైరెక్టర్ రాయుడు శ్రీను, నూకరాజు, ఆళ్ల శ్రీనివాస్, పైడిరమణ, జామి దాసు, జె శ్రీనివాసరెడ్డి, ఎండీ గౌస్, ఎం గోపి, నేపాల్‌శ్రీను, పరదేశిరెడ్డి, వెంకటేష్, షేక్ బాబ్జీ, తిరుమలరావు, హరిపట్నాయక్, జె సత్యనారాయణ, వరలక్ష్మి, కరుణ, నవాబ్, వెంకటేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అతి వేగమే రోడ్డు ప్రమాదాలకు కారణం



యువతకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ పాపారావు

మద్దిపాలెం: రోడ్డు ప్రమాదాలు జరగడానికి ప్రధాన కారణం అతి వేగమేనని కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా దృశ్య శ్రవణ పరికరాల ద్వారా ప్రజల్లో చైతన్యం పరిచేందుకు కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఇందులో భాగంగా కంచరపాలెం, బర్మా క్యాంప్ ,బిర్లా, పాలిటెక్నిక్ కాలేజీ హాస్టల్, ఎన్ఏడీ కూడళ్లలో ప్రత్యేక దృశ్య శ్రవణ వాహనం ద్వారా రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించామని తెలిపారు. గతంలో జరిగిన ప్రమాద దృశ్యాలను ప్రదర్శిస్తూ ప్రజలకు, విద్యార్థులకు ఈ మేరకు అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు పాపారావు, అన్వర్ ఉల్‌హక్, కానిస్టేబుల్ శంకర్ పాల్గొన్నారు.

46వ వార్డులో పింఛన్ల పంపిణీ



కొత్త పెన్షన్లు అందజేస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు శాంతినగర్ కమ్యూనిటీ హాల్‌లో నూతనంగా పెన్షన్ అర్హులైన లబ్ధిదారులకు మంగళవారం వార్డు కార్పొరేటర్ జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ పంపిణీ చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ అందేలా చూడడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వార్డు సీవో వరలక్ష్మి, వార్డు సచివాలయ కన్వీనర్లు, నాయకులు, వలంటీర్లు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగించొద్దు

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం పరిధి ఊర్వశికూడలి, బర్మాక్యాంప్ కొండవాలు సచివాలయాల పరిధిలో క్లాత్ బ్యాగ్‌ల వినియోగం, సీజనల్ వ్యాధుల వ్యాప్తి, డెంగ్యూ జ్వరాలపై మంగళవారం జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ విడనాడి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వ్యాధుల పట్ల అప్రమత్తతో ఉండాలన్నారు. తడి–పొడి చెత్త సేకరణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణ, దోమల నిర్మూలనపై ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. వార్డులో ఫాగింగ్ చేయడంలేదని స్థానికులు జెడ్సీకి ఫిర్యాదులు చేశారు. కార్యక్రమంలో జోన్–5 శానిటరీ సూపర్‌వైజర్ ఎస్.జనార్దన్, శానిటరీ, మలేరియా సిబ్బంది, సచివాలయం కార్యదర్శులు, ఎఎన్ఎంలు, వలంటీర్లు, పాల్గొన్నారు.

శ్రీనువాసుడికి సహస్ర దీపాలంకరణ



లలితాపీఠంలో సహస్ర దీపాలంకరణ సేవలో శ్రీనివాసుడు

సీతంపేట: ధనుర్మాసోత్సవాలలో భాగంగా అక్కయ్యపాలెం లలితాపీఠంలో దీపాల వైభవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దీనిలో భాగంగా 108 దీపాలంకరణతో అమ్మవారికి అర్చన, సాయంత్రం కల్యాణ శ్రీనివాసునికి సహస్ర దీపాలంకరణ సేవ చేశారు. ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొని దీపాలు వెలిగించారు. నిత్య కైంకర్యసేవలో భాగంగా ఉదయం 19వ పాశుర విన్నపం, గోదా చతుశ్లోకి, మంగళాశాసనం, బాలభోగ నివేదన చేశారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అద్దంలా సర్వీసు రహదారి



బిర్లా ప్రాంతంలో సర్వీసు రహదారి (నాడు)



సర్వీసు రహదారి (నేడు)

మురళీనగర్: మురళీనగర్ జాతీయ రహదారిని అనుబంధంగా నిర్మించిన సేవా రహదారులకు మరమ్మతులు చేయడంతో ప్రజల కష్టాలు తీరాయి. బిర్లా కూడలి నుంచి ఊర్వశి కూడలి వరకు ఎడమవైపు ఉన్న రహదారి భూగర్భ డ్రైనేజీ పనుల్లో భాగంగా తవ్వి వదిలేశారు. దీంతో ఈ సేవా రహదారిలో రాకపోకలు కష్టంగా ఉండేది. ముఖ్యంగా ఆటోలు,ద్విచక్ర వాహనాలు ఎక్కువగా ఇటువైపు ప్రయాణిస్తుంటాయి. గత కొన్నేళ్లుగా ఈ రహదారిని మెరుగుపరచాల్సిన యూజీడీ విభాగం పట్టించుకోలేదు. ఆలయాలకు వెళ్లే భక్తులు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు ప్రమాదాలకు గురయ్యేవారు.

ఈ రహదారిని ఆనుకుని పారిశ్రామిక ప్రాంతం, కార్ల షోరూమ్‌లు ఎక్కువగా ఉన్నాయి. నిత్యం రద్దీగా ఉంటుంది. దీంతో అధికారులు చర్యలు తీసుకుని తవ్వేసిన భాగాన్ని పూర్తి స్థాయిలో తారు రోడ్డుగా మార్చారు. దీనిపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ రహదారి వద్ద తప్పిన ప్రమాదం



వాహనాన్ని పక్కకు తప్పిస్తున్న దృశ్యం

మద్దిపాలెం : ఆర్అండ్‌బీ కూడలి జాతీయ రహదారి సమీపంలో మంగళవారం ప్రమాదం తప్పింది. ఈ మేరకు మాధవధార నుంచి జాతీయ రహదారి వైపు సిమెంటు ఇటుకల లోడుతో వస్తున్న బొలేరో వాహనం జాతీయ రహదారి అధిగమించే క్రమంలో ఒక్కసారిగా సర్వీసు రోడ్డులో ఇటీవల నిర్వహించిన పైపులైను పనులకు సంబంధించి తవ్వి పూడ్చిన గుంతలోకి కూరుకుపోయింది. ఎవ్వరికీ ఏమీ జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాద సమయంలో అదే ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ చూడడంతో అటుగా వెళ్తున్న వాహనదారులు స్పందించి వాహనాన్ని పక్కకు తొలగించారు.

ఉపాధి అవకాశాలు కల్పించండి



వేడుకల్లో పాల్గొన్న అతిథులు, దివ్యాంగులు

సీతంపేట: దివ్యాంగుల సేవా సంస్థ ప్రజ్వల్ వాణి వెల్ఫేర్ సొసైటీ 14వ వార్షికోత్సవం జగన్నాథపురంలోని సంస్థ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ వైస్ ఉపాధ్యక్షులు తోట పెద వెంకటేశ్వరరావు, స్మార్ట్ ఇన్ హోటల్ అధినేత బాబ్జి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సకలాంగులతో సమానంగా దివ్యాంగులు అన్ని రంగాలలో రాణించేలా తీర్చిదిద్దుతున్న ప్రజ్వల్ సంస్థ కృషిని అభినందించారు. దివ్యాంగులు తమ కాళ్లపై తాము నిలబడేలా వృత్తి విద్యా కోర్సుల్లో ఇస్తున్న శిక్షణ, ఉపాధి అవకాశాల కోసం సంస్థ చేస్తున్న కృషిని కొనియాడారు. సంస్థ వ్యవస్థాపకురాలు జె.వి.ఎల్.సుచిత్రా రావు మాట్లాడుతూ దివ్యాంగులకు, వారి తల్లులకు పలు వృత్తి విద్యా కోర్సులలో సంస్థ ద్వారా శిక్షణ ఇస్తున్నామని, వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని అతిథులను కోరారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆట, పాటలు, వేషధారణలతో అలరించారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలేకు ఘన నివాళి



సావిత్రీబాయి పూలేకు నివాళులు అర్పిస్తున్న అప్పారావు

కంచరపాలెం: మహిళా సాధికారతకు నిలువెత్తు రూపం సావిత్రీబాయి పూలే అని దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు కొనియాడారు. కంచరపాలెం పరిధి ఊర్వశికూడలి దళిత సేన కార్యాలయంలో మంగళవారం దళితసేన రాష్ట్ర అధ్యక్షుడు పాల్తేటి పెంటారావు పిలుపు మేరకు సావిత్రీబాయి పూలే 192వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గొల్లమాల అప్పారావు మాట్లాడుతూ కుల వివక్షత రూపుమాపడంలో సావిత్రీ భాయ్ దంపతులు పోరాటం అజరామమన్నారు. కార్యక్రమంలో దళిత సేన నగర మహిళా కన్వీనర్ గొల్లమాల మీనా, పుచ్చ కామేశ్వరరావు, పట్నాల ఝాన్సీరాణి, తాటిపూడి సీతారామ్, రాణి, జయ కుమార్, రాంజీ అభ్యుదయ సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

44వ వార్డులో ఇళ్ల పట్టాల పంపిణీ



ఇళ్ల పట్టాలు అందజేస్తున్న జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల

సీతంపేట: ప్రజా సంక్షేమమే రాష్ట్ర ముఖ్య మంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, 44వ వార్డు కార్పొరేటర్ బానాల శ్రీనివాసరావు అన్నారు. అబిద్‌నగర్ షాదీఖానా కళ్యాణ మండపంలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంతిల్లు లేని పేదవారు ఉండకూడదనే దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ఒకేసారి 31 లక్షల మందికి ఇళ్ల స్థలాలు, టిడ్కో ఇళ్లు మంజూరు చేశారన్నారు. అన్ని సదుపాయాలతో లేఅవుట్‌లు అభివృద్ధి చేసి ప్రభుత్వం ఇస్తోందన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను 95 శాతానికి పైగా అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా గెలిపించే విధంగా సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులు కృషి చెయ్యాలన్నారు. వార్డులో మంజూరైన 150 మందికి పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ పద్మావతి, సీవో కృపాకర్, హీరా, ఇజ్జు సీతారామ్, గోపి, వెంకటరావు, మహదాస్యం గోపి, సచివాలయ కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మణిదీపాలు కవితా సంపుటి ఆవిష్కరణ



కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న కూటికుప్పల

సీతంపేట: రచయిత్రి సాలిపల్లి మంగామణి రచించిన ' మణి దీపాలు' కవితా సంపుటి ఆవిష్కరణ సభ ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జరిగింది. కళావేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పద్మశ్రీ డాక్టర్ కూటికుప్పల సూర్యారావు ముఖ్య అతిథిగా హాజరై కవితా సంపుటిని ఆవిష్కరించారు. ప్రముఖ రచయిత డి.వి.సూర్యారావు పుస్తక సమీక్ష చేశారు.

ఈ కార్యక్రమంలో కళావేదిక వ్యవస్థాపకులు నండూరి రామకృష్ణ, విశ్రాంత ఆచార్యులు సజ్జా మోహన్‌రావు, సాహితీవేత్తలు నవ సాహిత్య ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు ఎస్.వి.సూర్యప్రకాశరావు, ఆర్ అండ్ బి డీఈ ఆర్.ఆర్. విద్యాసాగర్,తెలుగు ఉపన్యాసకులు బి.రజిని పాల్గొన్నారు.

శ్రీసిద్ధేశ్వరానంద భారతీస్వామి జన్మదినోత్సవం



సీతంపేట: కుర్తాళం శంకరాచార్య, లలితాపీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి 87వ జన్మదినోత్సవం మంగళవారం లలితాపీఠంలో ఘనంగా నిర్వహించారు. పీఠం దర్బారు హాల్లో పండితుల వేద మంత్రాల మధ్య పీఠాధిపతి చిత్రపటానికి పూజలు చేశారు. పీఠం మేనేజర్ మన్నవకృష్ణసేన్ దంపతులు పూజలు చేశారు. అనంతరం మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

పూజలు చేస్తున్న కృష్ణసేన్ దంపతులు

గ్రీవెన్స్‌కు విశేష స్పందన



వినతులు స్వీకరిస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కేకేరాజు

సీతమ్మధార : జీవీఎంసీ పరిధి 14 వార్డులోని బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజక వర్గం పార్టీ కార్యాలయంలోని మంగళవారం నెడ్‌క్యాప్ చైర్మన్, నియో జకవర్గ సమన్వయకర్త కేకే రాజు గ్రీవెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రజల తమ సమస్యలను వినతిరూపంలో సమర్పించారు. కొన్ని సమస్యలను తక్షణం అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. మరికొన్ని సంబంధిత అధికారులకు రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో 14 వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్ రాజు , కె.కామేశ్వరీ, మాజీ కార్పొరేటర్లు బులుసు జగదీష్, మువ్వల పోలారావు, పలువురు వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వృద్ధుడి మృతి



అఖిల్ అలీషా(ఫైల్)

గోపాలపట్నం(విశాఖ పశ్చిమ): జాతీయ రహదారిపై లారీ ఢీకొట్టిన ఘటనలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. విమానాశ్రయం జంక్షన్ దాటి మొదటి వంతెన వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. ఎయిర్‌పోర్ట్ పోలీసులు తెలిపిన వివరాలివీ.. పాత ఐటీఐ జంక్షన్ సమీపంలో నివాసముంటున్న మహమ్మద్ అఖిల్ అలీషా(73) గాజువాకలో పని ఉండడంతో స్కూటీపై వెళ్తున్నాడు. విమానాశ్రయం దాటిన తర్వాత జాతీయ రహదారిపై మొదటి వంతెన వద్దకు వచ్చే సరికి వెనుకనే వస్తున్న లారీ అతన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అలీషా కింద పడిపోగా.. ఆయన కాళ్లపై నుంచి లారీ వెళ్లడంతో నుజ్జునుజ్జయ్యాయి. తలకు కూడా గాయమవడంతో.. అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. అతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. స్థానిక మసీదులో ఆయన సేవలందిస్తున్నారు. కుమారుడి ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లారీని స్వాధీనం చేసుకుని.. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు యోగా సెంటర్ ప్రారంభం

మురళీనగర్: మురళీనగర్ తెన్నేటిపార్కు, బ్యాంక్ ఆఫ్ ఇండియా పక్కన క్షీరాబ్ధి లేడీస్ హాస్టల్ ప్రాంగణంలో యోగా కేంద్రాన్ని బుధవారం ప్రారంభించనున్నట్లు భారతీయ జనతాపార్టీ వైద్య విభాగం కన్వీనరు రూపాకుల రవికుమార్ తెలిపారు.ఈ కేంద్రాన్ని ఉదయం 10.30 గంటలకు మిజోరం రాష్ట్ర గవర్నర్ కంభంపాటి హరిబాబు ప్రారంభిస్తారని రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు, 50వార్డు కార్పొరేటరు వి.ప్రసాద్ పాల్గొంటారని చెప్పారు.

దివంగత నటీమణి భానుమతి సేవలు ఆదర్శప్రాయం



సీవీ రాజేశ్వరిని సత్కరిస్తున్న సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ జీఎస్ఎన్ రాజు, వీవీ రమణమూర్తి

అల్లిపురం: చిత్ర రంగానికి డాక్టర్ భానుమతి రామకృష్ణ చేసిన సేవల్ని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని సెంచూరియన్ విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య జీఎస్ఎన్ రాజు అన్నారు. ప్రఖ్యాత గాయని, నటి డాక్టర్. పి.భానుమతి వర్ధంతి సందర్భంగా మంగళవారం సాయంత్రం దాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో భానుమతి పాట.. సీవీ రాజేశ్వరి నోట అనే శీర్షికన సినీ సంగీత విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ భానుమతి గాయనిగా, నటిగా, స్టూడియో అధినేత్రిగా, రచయిత్రిగా, సంగీత దర్శకురాలిగా చిరస్మరణీయమైన సేవలు అందించారన్నారు. భానుమతి స్మారకార్థం సీవీ రాజేశ్వరి ఇటువంటి పాట కచేరీ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి. కృష్ణమోహన్ మాట్లాడుతూ వృత్తి ఏయూ, ప్రవృత్తి గానంగా చేసుకుని ప్రత్యేక గుర్తింపు పొందిన రాజేశ్వరి గానం ప్రశంసనీయమన్నారు. రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి మాట్లాడుతూ భానుమతి చిత్ర గీతాలు అన్ని వర్గాల ప్రజల హృదయాల్లో నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో గాయనీ గాయకులు పాడిన ఆకాశ వీధిలో హాయిగా, నీటిలోన నింగిలోన, జాబిలి ఓ జాబిలితో పాటు ఓహో ఓహో పావురమా, కన్నులే నీకోసం వంటి పాటలు ప్రేక్షకులను అలరించాయి. కార్యక్రమంలో ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ కార్యదర్శి చెన్నా తిరుమలరావు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం వీ రాజశేఖర్, సన్‌మూర్తి, కొణతాల రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీవీ రాజేశ్వరిని ముఖ్య అతిథులు సత్కరించారు.